విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఏడాది పాలనలో శాంతిభద్రతలు ఆగమాగం

- కక్ష సాధింపులు తప్ప సాధించిందేమీలేదు
- మహిళలపై అఘాయిత్యాలు పెరగడం సిగ్గుచేటు
- గాంధీభవన్ డైరెక్షన్‌లోనే బీఆర్ఎస్ నేతలపై కేసులు
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు ఆగమాగమయ్యాయని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ నాయకులు కురువ విజయ్‌కుమార్, తుంగ బాలు, అభిలాష్, వీరబాబుతో కలిసి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలపై డీజీపీ ఆదివారం నిర్వహించిన వార్షిక సమావేశంలో వెల్లడించిన వివరాలను చూస్తే క్షీణించిన శాంతిభద్రతల పరిస్థితి అర్థమవుతున్నదని తెలిపారు. సైబర్ నేరాలు, మహిళలపై అఘాయిత్యాలు, పేదలపై ఘోరాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన నాటి నుంచి హోం మంత్రి లేకపోవడం, ఏడాదిలో ఇద్దరు డీజీపీలు మారడం దురదృష్టకరమని పేర్కొన్నారు. జగిత్యాలలో పోలీసులపై కాంగ్రెస్ నేతలు దాడులు చేశారని ఆరోపించారు. సోషల్ మీడియాలో విమర్శలు రావడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో కాంగ్రెస్ నాయకులపై కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ షీటీమ్స్ పెట్టి రక్షణ కల్పిస్తే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల రక్షణను గాలికొదిలేసిందని ఆరోపించారు. తెలంగాణ పోలీసులను ప్రభుత్వం రాజకీయ కక్షలు తీర్చుకొనేందుకు వాడుకుంటున్నదని మండిపడ్డారు. ఇదేకోవలో క్రిశాంక్, కౌశిక్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్‌పై తప్పుడు కేసులు నమోదు చేసిందని దుయ్యబట్టారు. గాంధీభవన్ నుంచి వచ్చిన డైరెక్షన్ మేరకు పోలీసులు నడుచుకుంటూ చట్టాన్ని అపహాస్యం చేయడం దురదృష్టకరమని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లె కాంగ్రెస్ పాలనలో విముక్తి ప్రాంతంగా మారిందని పేర్కొన్నారు. అక్కడ జరుగుతున్న ఘటనలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయని చెప్పారు.

ఎమ్మెల్సీ కవితపై విమర్శలు సిగ్గుచేటు

- ఆమె బీసీల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నరు
- ఆది శ్రీనివాస్, రఘునందన్‌రావు బీసీ వ్యతిరేకులు
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పుట్టమధు

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): బీసీ కులగణన, రిజర్వేషన్ల కోసం ఎంతగానో పోరాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎంపీ రఘునందన్‌రావు విమర్శలు సిగ్గుచేటని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు. ఎమ్మెల్సీ కవితపై వారి వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం ఆయన ఓ వీడియో విడుదల చేశారు.

కాంగ్రెస్, బీజేపీలు బీసీల అభ్యున్నతికి ఏనాడూ పనిచేయలేదని పేర్కొన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వాడినని చెప్పుకుంటున్న ప్రధాని మోడీ బీసీ గణనకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. నెహ్రూ కాలం నుంచే కాంగ్రెస్ పార్టీ బీసీలకు వ్యతిరేకంగా పనిచేసిందని ఆరోపించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మాజీ సీఎం కేసీఆర్ బీసీల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. తన లాంటి బీసీలకు ఎన్నికల్లో టికెట్లు ఇచ్చి ఎమ్మెల్యేలుగా గెలిపించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని స్పష్టంచేశారు. బీసీల కోసం పోరాడుతున్న కవితకు బీసీలంతా మద్దతుగా నిలువాలని పిలుపునిచ్చారు.

నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి, జడ్పీ మాజీ వైర్మన్ విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా, మేయర్ నీతూకిరణ్

రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ ఎక్కడ?

- మహిళల భద్రతపై ముఖ్యమంత్రి సమీక్ష పెట్టాలి
- రైతుల భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రక్షణ గోడలా బీజేపీ నేతలు
- కాంగ్రెస్‌కు బీజేపీ తోక పార్టీగా మారిపోయింది
- నిప్పులు చెరిగిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బాన్సువాడను బంగారువాడ చేసిందే కేసీఆర్

బాన్సువాడను బంగారువాడలా మార్చిందే కేసీఆర్ అని కవిత గుర్తుచేశారు. నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో బాన్సువాడ నియోజకవర్గ నేతలతో ఆమె సమావేశమయ్యారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా బాన్సువాడకు నిధుల వరద పారించింది కేసీఆర్ అని, రూ.12 వేల కోట్ల నిధులు, 9 వేల ఇండ్లు ఇచ్చారని, బీటీ రోడ్లు, దవాఖానలు, విద్యా సంస్థలను ఏర్పాటు చేశారని చెప్పారు. 'కేసీఆర్ ఇచ్చిన నిధులను ముందు పెట్టుకొని ఎన్నికల్లో గెలిచిన వ్యక్తి పోచారం శ్రీనివాస రెడ్డి. ఆయనకు మంత్రిగా, స్పీకర్‌గా పదవులు ఇచ్చింది కేసీఆర్. కానీ ఇచ్చిన మర్యాదను ఆయన కాపాడుకుంటే బాగుండేది. రెక్కలు వచ్చిన తర్వాత తల్లిని వదిలేసిన బిడ్డలాగా.. గెలిచిన తర్వాత పార్టీ కష్టాల్లో ఉంటే వెంటనే పార్టీ మారిండు. తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడమంటే ఇదే' అని కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. 'పార్టీ కష్టాల్లో ఉంటే బాధ్యత తీసుకొని ముందుకు సాగాలి. కానీ బరువు దించుకొని పక్కకు తప్పించుకున్నరు' అని ఆక్షేపించారు. 'వారిని మంచి మనస్సుతో మనం క్షమించినా తెలంగాణ చరిత్ర క్షమించదు.. అలాంటి వారికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉన్నది. ప్రజలకు వద్దకు, కార్యకర్తల వద్దకు వెళ్లి ధైర్యం చెప్పాలి' అని పార్టీ నాయకులకు సూచించారు. కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి బాన్సువాడకు మంచి ఇన్‌చార్జిని ఇచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. జుబేర్, విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)// ఖలీల్‌వాడి : కేసీఆర్ హయాంలో ఆడబిడ్డలకు రక్షణ దొరికితే, కాంగ్రెస్ పాలనలో అన్యాయం జరుగుతున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిలో మొత్తం 2,34,158 కేసులు నమోదైతే దాదాపు 2,945 లైంగికదాడి, మహిళలపై దాడులు, వేధింపులు కలిపి 19 వేలకు పైగా ఘోరాలు మహిళలపై జరిగినవేనని, దీనిని బట్టి చూస్తే పరిస్థితి ఎంత భయానకంగా మారిందో అర్థం చేసుకోవచ్చునని వాపోయారు. బాలికలు, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తున్నదని, ఇప్పటికైనా ఆడబిడ్డల భద్రత విషయంలో సీఎం ప్రత్యేక సమీక్ష పెట్టాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జడ్పీ మాజీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు, మేయర్ దండు నీతూకిరణ్‌తో కలిసి సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌కు బీజేపీ తోక పార్టీగా మారిందని విమర్శించారు. 'రఘునందన్‌రావు అంటే కాంగ్రెస్ ఎంపీయా?.. బీజేపీపై నేను మాట్లాడలేదు. రఘునందన్‌రావునూ ఏమనలేదు. నిజామాబాద్‌కు వచ్చినందున కాంగ్రెస్‌ను అభివృద్ధి విషయంలో నిలదీస్తే బీజేపీకి ఎందుకు ఉలికిపాటు?' అని కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను నిలదీస్తే సీఎంకు రక్షణ గోడలా బీజేపీ నిలబడుతున్నదని దెప్పిపొడిచారు. టీఎస్ఎండీసీ చైర్మన్‌గా ఈరవత్రి అనిల్‌కు నియంత్రణ చేసే అధికారం ఉన్నా పెద్దవాగు, కప్పలవాగులో ఇసుక దోపిడీ జరుగుతున్నదని, పోలీస్ స్టేషన్ల ముందు నుంచే ఇసుక రవాణా అవుతున్నా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో ప్రజలకు తక్కువ ధరకే ఇసుక లభించేదని, ప్రభుత్వానికి మైనింగ్ ఆదాయం పెరిగిందని వివరించారు. ఇప్పుడు మైనింగ్ ఆదాయం జీరో అయిందని, కాంగ్రెస్ నేతల ఆదాయం పెరిగిందని ఎద్దేవాచేశారు. ఇసుక, గుట్కా దందాలకు అడ్డుకట్ట లేకుండా పోయిందని, పేట్రేగిపోతున్న గుట్కా దందాను పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

రాజ్యాంగ విలువలకు రేవంత్ తూట్లు

'రాహుల్‌గాంధీ రాజ్యాంగం అంటూ చిన్న పుస్తకాన్ని పట్టుకొని తిరుగుతున్నాడు. ఇక్కడ ముఖ్యమంత్రి మాత్రం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నాడు' అని కవిత మండిపడ్డారు. ఉల్టా పల్టా కేసులు పెట్టడం, ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా విగ్రహాలు మార్చడం, జిల్లాలను పట్టించుకోకపోవడం, ఎన్‌కౌంటర్లు జరగడం ఇప్పుడు చూస్తున్నామని, రాష్ట్రంలో తుపాకీ మోతలు ఉండొద్దని కేసీఆర్ పాలన అందిస్తే రేవంత్‌రెడ్డి శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారని విమర్శించారు. పీసీసీ చీఫ్ హోదాలో తొలిసారి నిజామాబాద్‌కు మహేశ్‌కుమార్‌గౌడ్ వచ్చినప్పుడు భరోసా ఇస్తాడనుకుంటే, నిధులపై ప్రకటన చేస్తాడనుకుంటే హైడ్రా మాదిరిగా నిద్రా పెడతామమంటూ సామాన్యులను భయపెట్టాడని మండిపడ్డారు. ఈ ప్రకటనతో చిన్నపాటి రియల్ వ్యాపారులంతా కుదేలయ్యారని వాపోయారు. నిద్రా తెచ్చి బుల్డోజర్లతో ఇండ్లు కూల్చేస్తామని చెప్పడంతో అందరూ భయపడుతున్నారని చెప్పారు. సంక్రాంతి లోపు కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం, 18 ఏండ్లు నిండిన యువతులకు స్కూటీలు, ఉద్యోగులకు పెండింగ్ డీఏలు, రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో ప్రజలు బీఆర్ఎస్‌వైపే చూస్తున్నారని, బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ధరణితోనే రక్షణ ఉండేది

ధరణి ద్వారా రైతుల భూములకు రక్షణ ఉండేదని, బీరువాలో వేసి తాళం వేసుకున్నట్టే ఉండేదని కవిత గుర్తుచేశారు. ఇప్పుడు భూ భారతి ద్వారా ఏటా వీఆర్వోలు వచ్చి కొత్త పహాణీలు రాస్తారనడం రైతుల్లో భయాందోళనలను సృష్టిస్తున్నదని చెప్పారు. రైతులను నరక యాతన పెట్టేందుకే భూ భారతిని తెస్తున్నారని విమర్శించారు. పోర్టల్ ప్రారంభానికి, రీ సర్వేకు ముందే రైతుల భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్‌ను వీడిన కొందరు నాయకులు ఇప్పుడు తీవ్రంగా మథన పడుతున్నారని, కాంగ్రెస్‌లోకి ఎందుకు పోయామా అని బాధ పడుతున్నారని కవిత తెలిపారు. 'డిప్యూటీ సీఎం భట్టి మొన్ననే రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామన్నడు. 28వ తేదీ అని చెప్పిండు. రాష్ట్రంలో ఎవ్వరికీ రూపాయి కూడా రాలేదు' అని ఎద్దేవాచేశారు. సమావేశంలో బీఆర్ఎస్ బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆయేషా ఫాతిమా, నగర అధ్యక్షుడు సిర్ప రాజు, సుజిత్‌సింగ్ ఠాకూర్, ప్రభాకర్‌రెడ్డి, సత్యప్రకాశ్, మాస్టా ప్రభాకర్, సుమిత్రానంద్, చింతా మహేశ్, శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ శంకర్ పాల్గొన్నారు.

లష్కర్లుగా కాంగ్రెస్ కార్యకర్తలు!

మొదటిపేజీ తరువాయి...

ప్రాజెక్టులోని నీరు లీకవుతుంది. నీరు నిల్వ ఉండకుండా పోతుంది. ఉమ్మడి పాలనలో పర్యవేక్షణ కొరవడడంతో చాలా చోట్ల గేట్లు, తూములు తుప్పుపట్టాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా 4వేల వరకు తూములను నిర్మించింది. వీటి నిరంతర పర్యవేక్షణ కోసం రెవెన్యూశాఖలోని 5073 మంది వీఆర్ఏలను లష్కర్లుగా, హెల్పర్లుగా నియమించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 1597మంది లష్కర్లు, 281మంది హెల్పర్లను నియమించాలని నిర్ణయించింది.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో తలనొప్పి!

లష్కర్లు, హెల్పర్ల నియామకం కోసం టెరిటోరియల్ సీఈల నేతృత్వంలో ప్రభుత్వం స్క్రీనింగ్ కమిటీలు ఏర్పాటు చేసింది. 45 ఏళ్లలోపు వయస్సు ఉండి, చదవడం, రాయడం వచ్చిన, ప్రాజెక్టుల సమీప గ్రామాల వారినే ఎంపిక చేయాలని మార్గదర్శకాలు జారీ చేసింది. వారికి నెలకు కనీస రూ.15వేల వరకు వేతనం చెల్లించాలని నిర్ణయించింది. కానీ స్థానికంగా ఎవరూ నిబంధనలు పాటించడం లేదని ఇంజినీర్లు వాపోతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు, దిగువస్థాయి నాయకుల నుంచి కూడా పైరవీలు వస్తున్నాయని, పైరవీలకు కొందరు మంత్రులు కూడా వత్తాలు పలుకుతున్నారని వాపోతున్నారు. ఒత్తిళ్లను తట్టుకోలేక, నిబంధనలకు విరుద్ధంగా ముందుకు వెళ్లలేక తమ పరిధిలోని లష్కర్ల నియామకాన్నే పక్కనపెట్టినట్టు కొందరు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పతంగి చైనా మాంజా తగిలి గాయపడిన ఐదేళ్ల బాలుడు వీక్షిత్

చైనా మాంజా తగిలి నలుగురికి గాయాలు

- జనగామ జిల్లా కేంద్రంలో బైక్‌లపై వెళ్తుండగా ఘటన

జనగామ చౌరస్తా, డిసెంబర్ 30 : జనగామ జిల్లా కేంద్రంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదుగా ఆదివారం రెండు బైక్‌లపై వెళ్తున్న నలుగురికి గాలి పటాలకు సంబంధించిన చైనా మాంజా తగిలి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన వినోద్, కోమల దంపతులు కుమారుడు వీక్షిత్‌తో కలిసి బైక్‌పై వడ్లకొండకు వెళ్లారు. అక్కడ శుభకార్యం ముగిసిన అనంతరం జనగామకు వస్తుండగా చైనా మాంజా తగలడంతో ముందు కూర్చున్న వీక్షిత్‌కు తీవ్ర గాయాలవగా, తల్లిదండ్రులకు స్వల్పగాయాలయ్యాయి. మరో బైక్‌పై వెళ్తున్న బచ్చన్నపేటకు చెందిన సనత్‌కుమార్‌కు మెడ, గొంతు భాగంలో మాంజా తెగి రక్తస్రావం జరిగింది. వీక్షిత్‌కు చంపక్ హిల్స్‌లోని ఎంసీహెచ్‌లో, సనత్ కుమార్‌కు స్థానిక జిల్లా ప్రభుత్వ ప్రధాన దవాఖానలో చేర్చారు.

ఆన్‌లైన్ మోసానికి యువకుడు బలి

వీణవంక, డిసెంబర్ 30 : ఆన్‌లైన్ ట్రేడింగ్ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతిగల్ గ్రామంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ తోట తిరుపతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బేతిగల్‌కు చెందిన ఉమ-సృజన్ దంపతులకు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు రిషివర్ధన్(18) ఆన్‌లైన్ ట్రేడింగ్ స్టాక్ మార్కెట్‌లో రూ.లక్ష వరకు పెట్టుబడులు పెట్టాడు. కంపెనీ వారు ఇంకా పెట్టుబడులు పెట్టాలని కోరగా డబ్బులు పెట్టలేక, ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే కోపగిస్తారని భయపడ్డాడు. సోమవారం సూసైడ్ నోట్ రాసి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సృజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్‌ను నమ్మితే.. మొదటికే మోసం

మొదటిపేజీ తరువాయి...

రైతాంగ సభ జరిగింది. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అందించిన రూ.10 వేలు కూడా ప్రస్తుతం రైతులకు అందడం లేదని, అనుకున్నది ఒక్కటి.. అయ్యింది ఒక్కటి అన్నట్టు పరిస్థితి తయారైందని, రైతులు ఆందోళనకు గురవుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల భర్తీతో పాటు 420 హామీలను రేవంత్‌రెడ్డి ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటివరకు ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందని, ఎన్ని హామీలను నెరవేర్చిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు మాత్రమే కనిపిస్తున్నదని చెప్పారు. అది కూడా బస్సులు లేక, ఉన్నా సీట్లు లేక కొట్లాటల పర్వం కొనసాగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరోమాట మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

పేదల భూములకు లీగల్ సమస్యలు రావా?

'లగచర్లలో దొరల భూములు తీసుకోవడానికి లీగల్ చిక్కులు వస్తే.. లంబాడి రైతుల భూములు లాక్కోవడానికి మాత్రం చిక్కులు రావా?' అని తమ్మినేని వీరభద్రం కాంగ్రెస్ సర్కార్‌ను ప్రశ్నించారు. లంబాడి రైతుల భూములను రక్షించేందుకు ఎర్రజెండా వస్తుందని భరోసా ఇచ్చారు. పెత్తందారుల భూములకు లీగల్ చిక్కులు వస్తాయని సీఎం రేవంత్ ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కొడంగల్‌లో 1,156 ఎకరాల సీలింగ్ భూమి ఉందని, గతంలో కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రేవంత్ కూడా దానిపై పోరాడారని గుర్తుచేశారు. అలాంటి భూముల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి కానీ, పచ్చటి పంటపొలాల్లో కంపెనీలు ఏర్పాటు చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్‌లోని 1,156 ఎకరాల సీలింగ్ భూముల్లో లీగల్ సమస్య తలెత్తుతుందని పేర్కొనడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పంటలు పండే భూములను తీసుకునే హక్కు ప్రభుత్వానికి లేదని ఉద్ఘాటించారు. బీడు భూములు, తొండలు కూడా గుడ్లు పెట్టని భూములను తీసుకొని అభివృద్ధి పనులు చేస్తున్నామని రేవంత్ ప్రచారం చేస్తున్నారని.. కానీ, ఆ భూములన్నీ పచ్చని పంటలు పండేవేనని స్పష్టం చేశారు. లగచర్లలో గతంలో సీపీఐ పర్యటించినప్పుడు ఈ ప్రాంతం పూర్తిగా పచ్చదనంతో నిండి ఉందని, నాడు చిత్రీకరించిన వీడియోలను సీఎంకు చూపించినట్టు తెలిపారు. రైతులకు సీపీఐ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అయితే, కలిసి పోరాడినప్పుడే భూములను కాపాడుకునే అవకాశం ఉంటుందని రైతులకు సూచించారు. రైతులపై పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని, వెంటనే రైతులందరినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, డీజీ హన్మంతరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్రాములు, జిల్లా కార్యదర్శి మహిపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బుస్స చంద్రయ్యతో పాటు రామకృష్ణ, శ్రీనివాస్, బుగ్గప్ప, సుదర్శన్, సతీష్, నర్సమ్మ, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

జస్టిస్ పర్వతరావుకు హైకోర్టు నివాళి

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ పర్వత రావు (90)కు తెలంగాణ హైకోర్టు ఘనంగా నివాళులర్పించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అధ్యక్షతన సోమవారం హైకోర్టులోని న్యాయమూర్తులంతా ప్రత్యేకంగా సమావేశమై జస్టిస్ పర్వతరావు సేవలను కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ 2 నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో సుప్రీం కోర్టు రిటైర్డు న్యాయమూర్తి పీ వెంకట్రామిరెడ్డి, హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ సీ కోదండరాం (జస్టిస్ పర్వత రావు అల్లుడు), అదనపు సొలిటర్ జనరల్ నర్సింహశర్మ, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, బార్‌కౌన్సిల్ చైర్మన్ ఏ నర్సింహారెడ్డి, హైకోర్టు బార్ అసోసియేషన్ చైర్మన్ ఏ రవీందర్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీ నాగేశ్వర్‌రావు, రిటైర్డు న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడు జస్టిస్ జీ యతిరాజులు, న్యాయవాదికారులు, రిజిస్ట్రార్లు, సీనియర్ న్యాయవాదులు, జస్టిస్ పర్వతరావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

గండికొట్టి నీటిని తరలించే ప్రయత్నాలను వీడండి

- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 30: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచి డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే ప్రయత్నాలను మానుకోవాలని, ఇందుకోసం తీసుకొచ్చిన జీవో 159ను వెంటనే రద్దు చేయాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు స్వార్థరాజకీయాలను మానుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలోని ఏదుల రిజర్వాయర్ సమీపంలో గండి కొట్టి డిండి ప్రాజెక్టు ద్వారా నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు నీటిని తరలించేందుకు తెచ్చిన జీవోను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

నాలుగు వేల పింఛన్‌కు మోక్షమెప్పుడో!

- ఏడాది దాటినా ఊసే ఎత్తని సర్కారు
- 44.7 లక్షల మంది ఎదురుచూపులు
- ఒక్కొక్కరికీ 12 నెలలకు 24 వేలు.. మొత్తంగా రూ.10,728 కోట్లు బాకీ
- లబ్ధిదారుల్లో పెరుగుతున్న అసహనం
- హామీ నెరవేర్చాలని ఆందోళనలు

'అవ్వా పింఛన్ ఎంతస్తున్నది? తాతా నీకెంతస్తుంది? రెండు వేలే కదా.. ఏం బాధపడకు పెద్దమ్మ.. వచ్చే డిసెంబర్ నెలల ఇందిరమ్మ రాజ్యమస్తుంది.. నీ ఖాతాలో నాలుగు వేలు పడ్తయ్.. ఎవ్వరినీ అడుక్కోవాల్సిన పనిలేదు.. మందు గోళీలు కొనాలన్నా, మనుమడికి చాక్లెట్లు కొనియ్యాలన్నా రంధిపడాల్సిన పనిలేదు.. పింఛన్ పెంచే బాధ్యత సోనియమ్మ తీసుకున్నది.. అమ్మ జన్మదినమైన డిసెంబర్ 9నాడు ఎల్బీ స్టేడియంల ఒక్క సంతకం పెట్టి మీ ఖాతాల నాలుగువేలు వేసే బాధ్యత నాది.'

- నిరుడు అసెంబ్లీ ఎన్నికల సభల్లో రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటిపోయింది. 2023 డిసెంబర్ పోయింది 2024 డిసెంబర్ కూడా వెళ్లిపోతున్నది. పింఛన్ పెరిగిందీ లేదు.. లబ్ధిదారుల ఖాతాల్లో నాలుగు వేలు పడ్డదీలేదు.. దీంతో ఎన్నికల హామీని తీర్చాలంటూ పింఛన్‌దారులు రోడ్డెక్కుతున్నరు. రాష్ట్రవ్యాప్తంగా నిత్యం ఏదో ఒకచోట ఆందోళనలకు దిగుతున్నరు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల్లో భాగంగా అభయహస్తం మ్యానిఫెస్టోలోని చేయూత కింద పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే 44.70 లక్షల మంది లబ్ధిదారుల పింఛన్లు పెంచుతామని, దరఖాస్తు చేసుకున్న మరో పది లక్షల మందికి పింఛన్లు మంజూరు చేస్తామని వాగ్దానం చేసింది. వృద్ధులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, డయాలసిస్ పేషెంట్లు, బోధకాలు బాధితులకు ఇచ్చే రూ.2 వేల పింఛన్‌ను రూ.4 వేలు, దివ్యాంగులకిచ్చే రూ.4 వేల పింఛన్‌ను రూ.6 వేలు చేస్తామని చెప్పింది. కానీ, ఏడాది దాటినా కార్యరూపందాల్చలేదు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగానైనా స్పష్టమైన ప్రకటన వస్తుందనుకున్నా నిరాశే ఎదురైంది.

ఒక్కో లబ్ధిదారుకు 24 వేల బాకీ

గత డిసెంబర్ నుంచే పింఛన్‌దారులకు పెంచిన మొత్తం ఖాతాల్లో జమచేస్తామని ప్రభుత్వం చెప్పింది. ఈ లెక్కన ఒక్కో లబ్ధిదారుకు 12 నెలలకు రూ.24 వేల చొప్పున బకాయి పడ్డది. మొత్తంగా 44.7 లక్షల మంది లబ్ధిదారులకు సుమారుగా నెలకు రూ.894 కోట్ల చొప్పున 12 నెలలకు సుమారు రూ.10,728 కోట్లు చెల్లించాలి. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు ఈ ఏడాది మార్చి నుంచి పింఛన్‌దారులకు బకాయిలు ఒకే విడతలో చెల్లించింది. కానీ, రేవంత్ సర్కారు మాత్రం ఏడాది దాటినా పింఛన్ మొత్తాన్ని పెంచకుండా దగా చేసిందని లబ్ధిదారులు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంతో పింఛన్ లబ్ధిదారులు ఆందోళన బాటపడుతున